# తెరతీయగరాదా!

## (త్యాగరాజస్వామి వారి కృతి అంతరార్థము)

- శ్రీ దూర్వాసుల వేంకట సుబ్బారావు.



సంగీత, సాహిత్య, వేదాంతములకు క్రమంగా నారద, పోతన, ఆదిశంకరులు ప్రతినిధులైనచో, శ్రీ త్యాగరాజస్వామి వీటి సంగమము, వీరి సంయోగము. వాగ్గేయకార త్రిమూర్తులు శ్రీ త్యాగరాజు, శ్రీ శ్యామశాస్త్రి, శ్రీ దీక్షితారులలో శ్రీ త్యాగరాజు ఆరాధ్యులు. శ్రీరాముని సాక్షాత్కరించుకున్న వేద, వేదాంగపండితుడు, రాజయోగి, జ్ఞాని శ్రీ త్యాగరాజు. వాల్మీకి రామాయణంలో ఉన్నవి 24000 శ్లోకాలు. త్యాగరాజస్వామి వ్రాసినవి కూడ 24000 కృతులే. వీటిలో 1200 లభ్యం. శ్రీ త్యాగరాజులవారిని "త్యాగబ్రహ్మ' అని, వారి కీర్తనలను 'త్యాగోపనిషత్' అని శ్రీశ్రీశ్రీ కాంచి కామకోటిపీఠాధిపతులు శ్రీ చంద్రశేఖర సరస్వతి కీర్తించేరు. శ్రీ త్యాగరాజస్వామి ఏ క్షేత్రమునకు వెళ్ళినా, ఆ క్షేత్రదేవునిపై కృతులను రచించారు. ఉదాహరణకు తిరువత్తియూరు, కొవ్వూరు, నాగపురం, శ్రీరంగ పంచరత్న కృతులు.

సంగీత, సాహిత్య, వేదాంతములకు క్రమంగా నారద, పోతన, ఆదిశంకరులు ప్రతినిధులైనచో, శ్రీ త్యాగరాజస్వామి వీటి సంగమము, వీరి సంయోగము. వాగ్గేయకార త్రిమూర్తులు శ్రీ త్యాగరాజు, శ్రీ శ్యామశాస్త్రి, శ్రీ దీక్షితారులలో శ్రీ త్యాగరాజు ఆరాధ్యులు. శ్రీరాముని సాక్షాత్కరించుకున్న వేద, వేదాంగపండితుడు, రాజయోగి, జ్ఞాని శ్రీ త్యాగరాజు. వాల్మీకి రామాయణంలో ఉన్నవి 24000 శ్లోకాలు. త్యాగరాజస్వామి వ్రాసినవి కూడ 24000 కృతులే. వీటిలో 1200 లభ్యం. శ్రీ త్యాగరాజులవారిని "త్యాగబ్రహ్మ' అని, వారి కీర్తనలను 'త్యాగోపనిషత్' అని శ్రీశ్రీశ్రీ కాంచి కామకోటిపీఠాధిపతులు శ్రీ చంద్రశేఖర సరస్వతి కీర్తించేరు. శ్రీ త్యాగరాజస్వామి ఏ క్షేత్రమునకు వెళ్ళినా, ఆ క్షేత్రదేవునిపై కృతులను రచించారు. ఉదాహరణకు తిరువత్తియూరు, కొవ్వూరు, నాగపురం, శ్రీరంగ పంచరత్న కృతులు.

ఈ మకుటాల్లో మచ్చుకి ఒక కీర్తన "తెర తీయగరాదా". దీన్ని గౌళపంతురాగంలో, ఆది తాళములో పాడుకుంటారు. ఇదే రాగంలో శ్రీ త్యాగరాజు వ్రాసినవి "రామ, రామ", "మోసబోకు వినవే", "కాసిచ్చేదే". శ్రీ శ్యామశాస్త్రి విరచితం "తరుణం ఈడమ్మ", అరుణాచల కవిరయార్ల "పరబ్రహ్మ స్వరూపిణే",

శ్రీ క్షేత్రయ్య రచన "ఎవ్వతెగూడిన" కూడ గౌళపంతు రాగంలో ఉన్నా, శ్రీ త్యాగరాజుస్వామివారి "తెర తీయగరాదా" చాలా ప్రశస్తము. కారణం ఈ కీర్తన పాడిన సన్నివేశము, దానిలోని భావసౌందర్యము. ఈ కీర్తన భావగర్భితమై, మన కండ్లకు కట్టినట్లు చిత్రింపబడ్డది.

శ్రీ త్యాగరాజస్వామి, తన శిష్యులతో ఏడుకొండలు ఎక్కి, స్వామి దర్శనానికి వెళ్ళిన సమయం అది. కాని స్వామి ఆరాధనకో, ఉపచారాలకో ఇతరులు చూడకుండ తెరవేసేరుట అర్చకులు. దర్శనానికి అవరోధంగా తనకే ఈ తెర వేసినట్లు శ్రీ త్యాగరాజస్వామి భావించి ఆంతర్య భావనతో "తెర తీయగరాదా" అని విన్నపిస్తూ గానం చేసేరు. పైపైగా ఈ ముసుగు తెర తొలగించి తనకు దర్శనమీయవలెనని ప్రార్థించినా, లోన చాల గొప్ప సందేశం అందజేసేరు శ్రీ త్యాగయ్య ఈ కీర్తనలో క్రింది విధంగా:

**పల్లవి**
తెర తీయగరాదా లోని
తిరుపతి వెంకటరమణ మత్సరమను || తె ||

**అనుపల్లవి**
పరమపురుష ధర్మాది మోక్షముల
పార దోలుచున్నది నాలోని || తె ||

**చరణము 1**
ఇరవొందగ భుజియించు సమయమున
ఈగ తగులు రీతి యున్నది
హరి ధ్యానము సేయువేళ చిత్తము
అంత్యజు వాడకు బోయినట్లున్నది || తె ||

**చరణము 2**
మత్స్యము ఆకలిగొని గాలముచే
మగ్నమైన రీతి యున్నది
అచ్చమైన దీప సన్నిధిని మరు
గిడబడి చెఱచినట్లున్నది || తె ||

**చరణము 3**
వాగురయని తెలియక మృగగణములు
వచ్చి తగులు రీతి యున్నది
వేగమె నీ మతము ననుసరించిన
త్యాగరాజనుత మదమత్సరమను || తె ||

ఇందులో మత్సరము అనగా అసూయ, ఈసు, కసి, కంటకము, కావేషము, గిట్టమి. "సొంతలాభం కొంతమానుకు, పొరుగువాడికి తోడు పడవోయి" అన్న గురజాడవారి ప్రభోదాన్ని తోసిపుచ్చి, పొరుగింటి పొయ్యి మండుచున్నదని, తన పొయ్యిలో నీళ్ళు పోసుకోవటం ఈ అసూయకు ఒక ఉదాహరణ. ప్రతీ మానవునిలోనూ ఆరు శత్రులు అనగా కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు ఉంటాయి. ఇవి లోలోపలే ఉండి మానవుని పురోగతికి అడ్డుతెరలై అడ్డంకాల్ని కలిగిస్తాయి. అట్టి విచక్షణ, జ్ఞానం లేక పోవటమే అజ్ఞానం. ఈ అజ్ఞానంలో పడటం ఎలా ఉంది అంటే శ్రీత్యాగరాజస్వామి ఐదు ఉపమానాలను తెలియజేసేరు. ఈ ఉపమానాలు లోకసహజమైనవి, అందరికీ తెలిసినవే అని గుర్తింపవలెను. అవి ఏవనగా:

1. మంచి ఆకలితో భోజనానికి కూర్చుంటే, నోటికి అడ్డంగా ఈగ వచ్చి చిరాకు, ఇబ్బంది కలిగించినట్లూ,
2. శ్రీ హరిని ధ్యానించే సమయంలో, మనస్సు చెంచలమై, అనాచారపు వాడలకు పరవళ్ళు తీసి భగ్నమైనట్లు,
3. ఆకలిచే చేప తళుకు బెళకుల ఎరను ఆహారంగా భావించి, అజ్ఞానంచే అదే గాలానికి చిక్కుబడ్డట్లు,
4. జ్ఞానమనే స్వచ్ఛమైన దీపపు కాంతిని ఏదో మాపి, అంధకారాన్ని అనగా అజ్ఞానాన్ని కలిగించినట్లు,
5. వేటకాడు పన్నినది ఉచ్చు, గొయ్యి అన్న అపాయాన్ని గుర్తించక, అజ్ఞానంతో లేళ్ళగుంపు గోతిలో దిగబడినట్లున్నది.

వీటన్నిటికీ మూలకారణం అజ్ఞానమే; విచక్షణాజ్ఞానం లేకపోవటమే. మానవుడు ఈ అజ్ఞాన తిమిరంలో కూరుకుపోయి, మాత్సర్యం, అజ్ఞానం వలన తనకు ముఖ్యమైన పురుషార్థములు అనగా ధర్మ, అర్థ, కామ, మోక్షములకు దూరమౌతున్నాడని శ్రీ త్యాగరాజు హెచ్చరించేరు. ఈ అజ్ఞానమనే మత్సరాన్ని - ఈ తెరని తొలగించి శ్రీ వేంకట రమణుని సాయుజ్యం ప్రార్థించేరు శ్రీ త్యాగరాజు.

ఈ కీర్తనపాడి, కనులు తెరిచేవేళకు, అంతవరకూ అవరోధంగా ఉన్న అడ్డతెరతొలగి రమణీయ కాంతులతో శ్రీ వేంకటేశ్వరుని దర్శనం లభించింది. గీతలో అర్జునుడు శ్రీ కృష్ణ విశ్వరూప దర్శన సందర్భంలో, ఒక్కసారి వేయి సూర్యుల కాంతిని (దివిసూర్య సహస్రస్య) చూసి సంభ్రమాశ్చర్యాలతో, ఆనందంతో తన్మయుడైనట్లు, శ్రీ త్యాగరాజస్వామి మధ్యమావతి రాగంలో "వెంకటేశ నిను సేవింపను, పదివేలకనులు కావలెనయ్య" అని సంకీర్తించి, తరించిన మహానుభావుడు.

"విశ్వకవి వేమన" వ్యాసాన్ని, "తెరతియగ రాదా" కృతి అర్థాన్ని వివరించే పై వ్యాసాన్ని అందించిన శ్రీ దూర్వాసుల వేంకట సుబ్బారావుగారికి ధన్యవాదములు. ఇలాంటి మరికొన్ని వ్యాసములు మా పాఠకుల కొరకు పంపవలసినదిగా మా మనవి.

ఉగాది శుభాకాంక్షలతో ...

సంఘమిత్ర కార్యవర్గం.